క్లుప్తంగా

సూర్యగిరి ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపల్ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు ఉదయం నుంచే క్యూలో నిలబడ్డారు. భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాగణంలో సామూహిక సత్యానారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. నాగదేవతకు పుట్టలో పాలు పోశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈఓ మోహన్‌రావు, సిబ్బంది మీగడ కాశీనాథ్, పూజారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అగర్‌మియాగూడలో వీధి దీపాల ఏర్పాటు



వీధి దీపాలను చూపుతున్న స్థానికులు

కందుకూరు: ఎస్‌డీఎఫ్ నిధులు రూ.5 లక్షలతో అగర్‌మియాగూడలో మంగళవారం 80 వీధి దీపాలను బిగించినట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఈర్లపల్లి శ్రీకాంత్‌రెడ్డి, ఇందిరమ్మ కమిటీ అధ్యక్షుడు వీర్లపల్లి దిలీప్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో గ్రామాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ కృషితో నిధులు మంజూరవుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.వెంకట్‌రెడ్డి, సీహెచ్ రవీందర్, రమేశ్, విష్ణు, శ్రీకాంత్, పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు టమాటా రూ.27, వంకాయ రూ.35, బెండ రూ.45, పచ్చిమిర్చి రూ.28, కాకరకాయ రూ.32, బీరకాయ రూ.38, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.13, క్యారెట్ రూ.43, దొండ రూ.40, ఆలుగడ్డ రూ.23, ఉల్లిగడ్డ రూ.24, గోకరకాయ రూ.33, దోసకాయ రూ.18, సొరకాయ రూ.13, పొట్లకాయ రూ.15, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.45, చామగడ్డ రూ.23, మునగ రూ.65, కందగడ్డ రూ.35, బీట్‌రూట్ రూ.23, కీర రూ.18, బీన్స్ రూ.55, క్యాప్సికమ్ రూ.50. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

దరఖాస్తుల ఆహ్వానం

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ మండల పరిధిలోని నూతనంగా ఎంపికైన ప్రీ ప్రైమరీ పాఠశాలలలో ఇన్‌స్ట్రక్టర్స్-2, ఆయా-2 ఉద్యోగాల ఎంపికకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ తెలిపారు. ఇన్‌స్ట్రక్టర్స్‌కు ఇంటర్, ఆయాకు 7వ తరగతి అర్హత ఉండాలన్నారు. మండల పరిధిలో ప్రీప్రైమరీకి ఎంపికైన పాఠశాలలు ప్రాథమిక పాఠశాల చంపాపేట, పాథమిక పాఠశాల భూపేష్‌గుప్తా నగర్ ఎంపికైందని ఈ నెల 9వ తేదీలోగా ఎంఈఓ కార్యాలయం సరూర్‌నగర్‌లో దరఖాస్తులను అందజేయాలన్నారు.

పార్కులను అభివృద్ధికి చేస్తాం

వనస్థలిపురం: డివిజన్ పరిధి ఎఫ్‌సీఐ కాలనీలో చిల్డ్రన్స్ పార్క్ ఏర్పాటుకు కృషి చేస్తానని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎఫ్‌సీఐ కాలనీ, వనస్థలిపురం బీకేఎస్ గ్రౌండ్, శ్రీనివాసపురం కాలనీల్లో ఆయన పర్యటించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. బీకేఎస్ గ్రౌండ్, శ్రీనివాసపురం కాలనీలోని పార్కును అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

వసతుల కల్పనకు కృషి

నాగోలు: కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్ శ్మశాన వాటికలో మౌలిక వసతులు కల్పిస్తానని కార్పొరేటర్ పవన్‌కుమార్ హామీ ఇచ్చారు. మంగళవారం మోహన్‌నగర్ శ్మశాన వాటిక అభివృద్ధి పనులపై బస్తీవాసులతో సమావేశం నిర్వహించారు. ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని మోహన్‌నగర్ శ్మశాన వాటిక అభివృద్ధికి రూ. 34 లక్షల నిధులు మంజూరు చేయించినట్లు వెల్లడించారు. చాలా ప్రాంతాల్లో శ్మశానవాటికలు అధునాతనంగా తీర్చబడ్డాయని కొత్తపేట (మోహన్‌నగర్) శ్మశాన వాటికలో మాత్రం ఎలాంటి సౌకర్యాలు లేవన్నారు. బస్తీవాసులు సూచనల మేరకు పనుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన ప్రారంభిస్తామన్నారు.

జైజై గణేశా..



హుడాకాంప్లెక్స్: గణనాథుడి సేవలో సరూర్‌నగర్ శ్రీనివాస్‌నగర్ కాలనీవాసులు



బడంగ్‌పేట్: గణనాథుడిని దర్శించుకున్న ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం, జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి



బడంగ్‌పేట్: గణనాథుడి పూజలో తహసీల్దార్ ఇందిరాదేవి, ఉత్సవ కమిటీ సభ్యులు

మహేశ్వరం నియోజకవర్గంలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. 7వ రోజు మంగళవారం బొజ్జగణపయ్యకు భక్తులు, ఉత్సవ సభ్యులు ఘనంగా పూజలు నిర్వహించారు. ఉండ్రాళ్లు, వివిధ రకాల పిండి వంటలను స్వామివారికి నైవేద్యంగా సమర్పించి జయములివ్వు గణేశా అంటూ వేడుకున్నారు. మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.



పహాడీషరీఫ్: జల్‌పల్లిలో అన్నదానం



పహాడీషరీఫ్: శ్రీరాం కాలనీలో..



మహేశ్వరం: చిన్నతూప్రలో గణనాథుడికి పూజలు చేస్తున్న టీపీసీసీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి, నాయకులు



తుక్కుగూడ: శోభాయాత్రలో రాంకీ వాసులు

రోడ్ల అభివృద్ధిని పట్టించుకోని ప్రభుత్వం

మొయినాబాద్: గ్రామీణ రోడ్ల అభివృద్ధిపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి, మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి విమర్శించారు. మున్సిపాలిటీలోని పెద్దమంగళారం-చందానగర్ రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో బీఆర్‌ఎస్ నాయకులు వరినాటు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే రోడ్ల అభివృద్ధి జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా రోడ్ల అభివృద్ధిని పట్టించుకోవడం లేదన్నారు. వర్షాల కారణంగా రోడ్లన్నీ గుంతలయమంగా మారి ప్రజలు, వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేసి వెంటనే పనులు మొదలు పెట్టాలని డిమాండ్ చేశారు. లేదంటే బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ రవుఫ్, మాజీ సర్పంచ్‌లు కోట్ల నరోత్తంరెడ్డి, నవీన్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మోర శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

టౌన్‌ప్లానింగ్ అధికారి బదిలీ

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీలో టౌన్‌ప్లానింగ్ అధికారిగా పని చేసిన అబీబ్‌ఉన్నిసాబేగం బదిలీ మంగళవారం అయ్యారు. ఆమె స్థానంలో వరప్రసాద్ బదిలీపై వచ్చారు. బుధవారం ఆదిబట్ల నూతన టీపీఓగా వరప్రసాద్ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ మేరకు సీడీఎంఏ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది.

వసతిగృహంలో సమస్యల తిష్ట



నేదునూరు ఎస్సీ బాలుర వసతిగృహంలో మురుగు గుంతను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ఆవరణలోనే మురుగు గుంత
- పెచ్చులూడుతున్న భవనం పైకప్పు
- హాస్టల్‌ను సందర్శించిన సీపీఎం నాయకులు

కందుకూరు: వసతి గృహంలోని విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం మండల కమిటీ సభ్యుడు అంకగళ్ల కుమార్, బుడ్డీరపు శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి మిద్దె యాదయ్య డిమాండ్ చేశారు. నేదునూరు పరిధిలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని మంగళవారం వారు సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. శిథిలావస్థకు చేరిన భవనం స్లాబ్ పెచ్చులు ఊడుతున్నాయని, ఆవరణలో ఉన్న భారీ మురుగు గుంతతో దుర్గంధం వ్యాపిస్తోందని, నాలుగు నెలలుగా కాస్మోటిక్ బిల్లులు అందడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేశారు. వీరి వెంట మాజీ ఉప సర్పంచ్ ఉన్ని సాయిలు, మాజీ వార్డు సభ్యుడు వంగూరు యాదయ్య, నాయకులు కె.రాములు, ఎండీ జాఫర్‌బేగ్, బి.మైసయ్య, బి.చెన్నయ్య తదితరులు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు పలువురి శుభాకాంక్షలు

మొయినాబాద్: చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మొయినాబాద్‌లోని తన నివాసంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య రత్నం వేడుకలు జరుపుకొన్నారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజభూపాల్‌గౌడ్, రాష్ట్ర నాయకులు అంజన్‌కుమార్‌గౌడ్, సన్‌వెల్లి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా నాయకులు గోపాల్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, వెంకటేశ్‌గౌడ్, క్యామ పద్మనాభం తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం

మహేశ్వరం: దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజల హృదయాల్లో స్థిరస్థాయిగా నిలిచారని కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు కాకి ఈశ్వర్ ముదిరాజ్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో శివగంగ రాజరాజేశ్వర ఆలయ చైర్మన్ అల్లె కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల ఎస్టీ సెల్ మాజీ అధ్యక్షుడు సేనావత్ రాజునాయక్, మైనార్టీ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహ్మద్ ఇర్షాద్, నాయకులు పలువురు పాల్గొన్నారు.

అల్మాస్‌గూడలో..

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడలో మంగళవారం ఏఐసీసీ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి అధ్వర్యంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 16వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ విగ్రహానికి భారీ గజమాల వేసి నివాళులర్పించారు. తెలుగు రాష్ట్రాలకు మహానేత చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో మాజీ మేయర్ చిగురింత పారిజాత, మాజీ కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, పెద్దబావి దర్శన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నవారు మల్లారెడ్డి, గట్టు బాలకృష్ణ, శ్రీధర్‌రెడ్డి, వినోద్‌నాయక్, దిండు శ్రీనివాస్‌గౌడ్, రామకృష్ణారెడ్డి, వెంకటేశ్‌గౌడ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

మహానేత వైఎస్సార్

కందుకూరు: దివంగత మహానేత వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకొని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సొడవు వెంకటేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం కందుకూరులోని వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.కృష్ణనాయక్, పీసీసీ ప్రధాన కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సరికొండ మల్లేశ్, పార్టీ మండల మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాణాప్రతాప్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు: వైఎస్సార్ విగ్రహం వద్ద..



బడంగ్‌పేట్: అల్మాస్‌గూడలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



మహేశ్వరంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కాళేశ్వరంపై కాంగ్రెస్ కుట్ర

- బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు హన్మగళ్ల చంద్రయ్య
- ప్రాజెక్టును సీబీఐకి అప్పగించడాన్ని ఖండిస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిరసన



మహేశ్వరం: మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

మహేశ్వరం: కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేసి కేసీఆర్‌ను ఇబ్బందులకు గురి చేస్తుందని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు హన్మగళ్ల చంద్రయ్య ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణకు కాంగ్రెస్ ప్రభుత్వం సీబీఐకి అప్పగించడాన్ని బీఆర్‌ఎస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. కాళేశ్వరంపైన కాలయాపన చేసి మొత్తం గోదావరి జలాలను ఆంధ్రకి తీసుకెళ్లే కుట్ర చేస్తున్నారన్నారు. కేసీఆర్‌పై ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు ఆయనవైపే ఉన్నారన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మంచె పాండుయాదవ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రాజునాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరిగౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్లు పొల్కం బాలయ్య, కె.ప్రభాకర్, బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు దయ్యాల శ్రీనివాస్, శివగంగ ఆలయ మాజీ చైర్మన్లు మునగపాటి నవీన్, నిమ్మగూడెం సుధీర్‌గౌడ్, మండల మాజీ కో-ఆప్షన్ సభ్యుడు అదిల్ అలీ, పార్టీ సీనియర్ నాయకులు జాన్‌రెడ్డి, నర్సింహాగౌడ్, అంజనేయులుగౌడ్, వీరబాబు, కృష్ణ, పర్వతాలు పాల్గొన్నారు.

ప్రజలను పక్కదోవ పట్టించేందుకు కుట్ర



పహాడీషరీఫ్: జల్‌పల్లి కమాన్ వద్ద సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

పహాడీషరీఫ్: బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై రాజకీయ కక్షతోనే కాళేశ్వరం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సీబీఐ విచారణకు తెరలేపిందని ఆ పార్టీ జల్‌పల్లి మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు షర్ఫుద్దీన్ హామెద్ అన్నారు. మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి పిలుపుమేరకు జల్‌పల్లి కమాన్ వద్ద మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తాగు, సాగు నీరు లేక కరువుతో అల్లాడుతున్న తెలంగాణకు కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించి సస్యశ్యామలం చేసిన అపర భగీరథుడు కేసీఆర్ అన్నారు. మేడిగడ్డలో కుంగిన మూడు పిల్లర్లకు రిపేర్ చేయలేని స్థితిలో ఈ ప్రభుత్వం ఉందన్నారు. 14 ఏళ్ల పాటు ఉద్యమం చేపట్టి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను నెరవేర్చిన మహా నాయకుడిపై ముఖ్యమంత్రి ఇష్టానుసారంగా మాట్లాడడం తగదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమ లు చేయలేక ప్రజల నుంచి వ్యతిరేఖతను పక్కదోవ పట్టించేందుకే.. కేసీఆర్‌పై కేసులు నమోదు చేస్తున్నా రని మండిపడ్డారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు షేక్ అఫ్జల్, పార్టీ నాయకులు ఆరీఫ్ అలీ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు



కందుకూరు చౌరస్తాలో ధర్నా చేస్తున్న నాయకులు

కందుకూరు: కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందంటూ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుపై ఆరోపిస్తూ కేసును సీబీఐకు అప్పగించడాన్ని నిరసిస్తూ బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జయేందర్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని శ్రీశైలం రహదారిపై ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీజేపీ జేబు సంస్థ అని ఆరోపణలు చేసే కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు అదే సంస్థకు కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ చేయాలంటూ అప్పగించడం విడ్డూరంగా ఉందన్నారు. కేసీఆర్‌ను బద్నాం చేయాలని చూస్తూ తెలంగాణ ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్‌ముదిరాజ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు జి.లక్ష్మీనర్సింహరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.మేఘనాథ్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు టి.ఇందిరాదేవేందర్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కాకి దశరథ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతుబజారులో వసతుల కల్పనకు కృషి

చైర్మన్ పెంటయ్యగౌడ్



రైతు బజారులో చిరువ్యాపారులతో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ సభ్యులు

చేవెళ్ల: అందుబాటులోకి వచ్చిన రైతుబజారులో మౌలిక వసతుల కల్పనకు మార్కెట్ కమిటీ తరఫున పూర్తి సహకారం అందిస్తామని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ బి.రాములు, పాలకవర్గం సభ్యులు అన్నారు. చేవెళ్లలోని రైతు బజారులో మంగళవారం కూరగాయల అమ్మకాలు చేస్తున్న చిరువ్యాపారులతో మాట్లాడి అక్కడ సమస్యలు తెలుసుకున్నారు. వ్యాపారులు షెడ్‌లలో గతంలో ఏర్పాటు చేసిన లైట్లు, వసతులు అన్ని పాడవడంతో మళ్లీ కొత్తగా ఏర్పాటు చేయాలని కోరారు. వెంటనే మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు తమ సొంత నిధులతో లైట్లు, తాగునీటి వసతికి కావాల్సిన నల్లాలను ఏర్పాటు చేయించారు. బాత్‌రూమ్‌లు కూడా ఉపయోగించుకునే విధంగా నీటి వసతిని ఏర్పాటు చేసి ఆవరణ మొత్తం శుభ్రం చేసే పనులు చేపట్టారు. వ్యాపారులు ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని వ్యాపారులకు సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి మహేందర్, పాలకవర్గ సభ్యులు ఉన్నారు.

తెలంగాణ జట్టు క్రీడాకారుల ఎంపిక

మన్సూరాబాద్: ఈ నెల 5 నుంచి 10వ తేదీ వరకుగ్వాలియర్‌లో జరిగే 9వ జాతీయ వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ పోటీలకు తెలంగాణ జట్టును ప్రకటించారు. 12 మంది క్రీడాకారుల్లో 8 మంది ఎల్‌బీనగర్‌కు చెందిన దివ్యాంగుల హాస్టల్ విద్యార్థులు ఎంపిక కావటం విశేషం. మన్సూరాబాద్ శైలజాపురికాలనీలోని దివ్యాంగుల ప్రభుత్వ హాస్టల్ నుంచి శివానాయక్, రాహుల్, చంపాపేట దివ్యాంగుల ప్రభుత్వ హాస్టల్ నుంచి దరావత్ సురేష్, గుండ్యానాయక్, శివానాయక్, కర్మన్‌ఘాట్‌లోని దివ్యాంగుల ప్రభుత్వ హాస్టల్ నుంచి కోటేశ్వరనాయక్, సాగర్ రింగ్‌రోడ్డు ప్రాంతంలో నివాసముంటున్న శంకర్‌బాబు, బన్నీ తెలంగాణ జట్టుకు ఎంపికయ్యారు.

పంటల నమోదు తప్పనిసరి

నందిగామ: రైతులు తాము సాగు చేసే పంటల వివరాలను సంబంధిత ఏఈఓల వద్ద నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి రామశివరావు అన్నారు. నందిగామలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. రైతులు తాము సాగు చేసే వివరాలను వ్యవసాయ శాఖ వద్ద నమోదు చేసుకున్నట్లయితే పంటలను విక్రయించే సమయంలో సులభతరంగా ఉంటుందన్నారు. అదేవిధంగా రాయితీపై పనిముట్లు కావాల్సిన రైతులు రైతువేదిక వద్ద ఏఈఓలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.